తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
3 మే 2026
పేజీలు : 08





## ఉష్ణోగ్రతలు పెరిగి..

ఇప్పటికే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి వడదెబ్బతో రోజుకు ఇద్దరు ముగ్గురు ప్రాణాలు వదిలేస్తున్నారు. భవిష్యత్తులో నీళ్లు కూడా దొరకని ప్రమాదానికి మనిషి నెట్టబడుతున్నాడు. అదేవిధంగా మనిషి ఆయు ప్రమాణాలు కూడా నానాటికీ దిగజారుతున్నాయి. పదేళ్లలోపు ఉన్న చిన్నారులకు సైతం గుండెపోటు, మెదడువ్యాపు లాంటి వ్యాధులు వస్తున్నాయంటే ప్రకృతిని మానవులు ఎంతగా చెరబట్టారో తెలుస్తోంది. ఎక్కడ చూసినా టెస్ట్ ట్యూ బేబీల ఆసుపత్రులే దర్శనమిస్తున్నాయి. సహజ సిద్ధంగా మనిషి పుట్టుక, మరణం కూడా కొరవడటం తీవ్ర ఆందోళనకరంగా ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. పుట్టిన బిడ్డ తాగే పాలు మొదలు తినే ఆహారం వరకూ అన్నీ విషతుల్యమైన ఆధునిక సమాజంలో ముున్ముందు మనిషి ఎలా మనగలుతాడో..!?





# పిండం పెడదామన్నా కాకులు లేవు!!

## గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌తో విపరీతంగా ఉష్ణోగ్రతలు

- నాటి నుంచి నేటిదాకా ప్రకృతిని చెరబట్టిన మనిషి
- ప్రమాదపుటంచుల్లో సమస్త జీవరాశుల ఉనికి
- రకరకాల వ్యాధులు.. పదేళ్లకే గుండెపోట్లు
- ఆయు ప్రమాణం తగ్గి.. బోనస్ లైఫ్‌తో బతుకు

మిద్దెల సత్యనారాయణ,
రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :

ఆదిమానవుడి కాలంలో ఆనాడు మనిషి ప్రకృతిని కాపాడుకున్నాడు. ప్రకృతి కూడా మనిషిని కాపాడింది. నాడు మనిషి ప్రకృతితో సహజీవనం చేశాడు కానీ నేటి ఆధునిక యుగంలో ఆధునిక మానవుడు ప్రకృతికి విరుద్ధంగా ప్రయాణిస్తుండు. దాంతో అకాల వర్షాలు, వరదలు విలయతాండవం చేస్తున్నాయి. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌తో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మంచు కరిగి సముద్రమట్టం పెరుగుదలతో అనేక దీవులు అంతరించిపోతున్నాయి. వాతావరణ సమతుల్యత కోల్పోవడంతో ఎండలు మండిపోతున్నాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మానవుడి ఉనికితో పాటు భూమిపై ఉన్న సమస్త జీవరాశుల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

మానవ తప్పిదాలతో ఇప్పటికే అనేక జీవ జాతులు అంతరించిపోతున్నాయి. మనిషి చనిపోతే కనీసం పిండం పెడదామంటే కాకులు లేని సమాజాన్ని చూస్తున్నాం. జీవరాశులు లేని సమాజాన్ని ఎదుర్కొంటున్నాం. అడవులను బడా కార్పొరేట్ పారిశ్రామికవేత్తలైన ఆదానీ అంబానీలకు కట్టబెట్టి లక్షలాది చెట్లను నరికి వేయిస్తున్నారు పాలకులు. పెట్టుబడుదారుల సంపద పెంపు కోసం అడవులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయి పాలకవర్గాలు.



రానురాను పాలకులతో పాటు మానవుడు కూడా ప్రకృతిని విధ్వంసం చేశాడు. ఎక్కడికక్కడ అడవులను నరికి వేయడంతో ప్రకృతి నుండి వీచే గాలి సైతం కొరత ఏర్పడే దుస్థితి నెలకొంది. ఎండ వేడిమికి తట్టుకోలేని మనిషి కాస్త నీడకు నిలబడదామంటే చెట్టు నీడ వెతుక్కోవలసిన పరిస్థితి. బడా పారిశ్రామికవేత్తల పెట్టుబడులతో కాలుష్య కారకమైన పరిశ్రమలను నెలకొల్పడం, రాత్రి పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా కాలుష్యాన్ని వదలడంతో ప్రకృతి పూర్తిగా ధ్వంసమవుతోంది. కండ్లకు కడుతున్న ఈ ఘోరకలిని అడ్డుకునే స్థితిలో పాలకులు లేకపోవడం శోచనీయం.

### చెట్లను నరికివేయడంతోనే :

త్యారల యాదయ్య, ఇప్పలపల్లి గ్రామం, కేశంపేట మండలం



నా వయసు 76 సంవత్సరాలు. మా కాలంలో ఇంత దారుణమైన ఎండలను ఎప్పుడు చూడలేదు. ఉదయం తొమ్మిది అయిందంటే చాలు బయటికి వెళ్లలేకపోతు న్నాం. అడవులను ధ్వంసం చేయడం, సెల్‌ఫోన్ టవర్లతో పక్షులు లేకపోవడం, వర్షాలు పడకపోవడం వల్ల ఎండలు భరించలేన ంతగా కొడుతు న్నాయి. చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా పడతాయి. చల్లదనం ఉంటుంది. అడవులను పెంచుకోకపోతే భవిష్యత్తులో మరింత ప్రమాదకరం.

### ఈ పాపం ప్రభుత్వాలదే.. :

రామకృష్ణ, ఇప్పలపల్లి గ్రామం



కరోనా లాంటి భయంకరమైన వ్యాధులు దరిచేరినప్పటి నుండి కరోనా ఇంజక్షన్ వల్ల ఇప్పటికీ కోలుకోలేకపోతున్నాం. మా కాలంలో ఇలాంటి రోగాలు ఇలాంటి మందులు లేవు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా చెట్ల మందులతో తగ్గించుకు నేవాళ్లం. వ్యవసాయం చేసి కాయకష్టం చేశాం. నేటి మనిషి సుఖానికి అలవాటు పడ్డాడు. ప్రకృతిని నాశనం చేయడం వల్లనే ఈ దుష్పరిణామాలు వస్తున్నాయి. ఇందులో ప్రభుత్వాలదే ప్రధాన పాపం.

### ఆకాశంపైకి చూసి చెప్పెటోళ్లం :

ఎల్లయ్య, ఇప్పలపల్లి గ్రామం



నాకు 77 ఏళ్లు. మా కాలంలో రాగిజావా, బెల్లం, రాగి సంకటి తిని కిలోమీటర్ల మేర వెళ్లి కూలి పనిచేసెటోళ్లం. ఏ రోగం వచ్చినా ఇంట్లోనే చెట్ల మందులతో తగ్గించుకున్నాం. మా కాలంలో వర్షాలు కూడా మంచిగా పడేటివి. వానలు వస్తాయా రావా అన్నది ఆకాశంపైకి చూసి, సూర్యుడిని చూసి సమయం గుర్తుంచుకునేవాళ్లం. కోడికూతతో నిద్ర లేస్తుంటిమి. ఇప్పుడు చూద్దామన్నా పక్షులే లేవు. ఇప్పటికైనా సర్కారోళ్లు అడవులను నరకడం మాని చెట్లను పెంచితేనే భవిష్యత్తు ఉంటది.

# చెరువుల పునరుద్ధరణలో ఇల్లు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ఉప్పల్ మే 02 ( జనం సాక్షి ):** నగరంలోని చెరువుల పునరుద్ధరణ పనుల కారణంగా నివాసాలు కోల్పోయిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. చెరువుల ఆక్రమణల తొలగింపు మరియు పునరుద్ధరణ చర్యల నేపథ్యంలో ఇల్లు కోల్పోయిన అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్ చెరువు ప్రాంతాల్లో నివాసాలు కోల్పోయిన బాధితులతో హైడ్రా కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని, ప్రభుత్వం చేపడుతున్న పునరావాస చర్యలపై వారికి వివరించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ, అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గూగుల్ మ్యాప్ శాటిలైట్ చిత్రాలు, పాత రికార్డులు మరియు ఇతర ఆధారాల సహాయంతో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా 2024 జూలై 19 తేదీకి ముందు ఆ ప్రాంతాల్లో నివాసం ఉన్న కుటుంబాల వివరాలను సేకరిస్తున్నామని వెల్లడించారు. చెరువుల పునరుద్ధరణ పేరుతో పేదలకు అన్యాయం జరగదని, ప్రభుత్వ లక్ష్యం చెరువులను కాపాడటంతో పాటు పేదల పునరావాసాన్ని కూడా సమానంగా చూడటమేనని ఆయన స్పష్టం చేశారు. చెరువుల ఆక్రమణలను తొలగించడం ద్వారా నగరంలో వరద సమస్యలను తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సహాయపడుతుందని తెలిపారు.నగరంలోని అన్ని చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాల్లో ఇదే విధానాన్ని అమలు చేస్తామని రంగనాథ్ వెల్లడించారు. చెరువులను రక్షించడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూనే, పేద ప్రజల జీవన భద్రత విషయంలో సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పునరావాస కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

# వర్షాకాలానికి ముందస్తు చర్యలు

## రామంతాపూర్, చిలుకానగర్‌లో నాలా అభివృద్ధి పనులు వేగవంతం



**ఉప్పల్ మే 02 (జనం సాక్షి):** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్, చిలుకానగర్ ప్రాంతాల్లో అధికారులు నాలా అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం ఎదురయ్యే వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని నాలాల పూడికతీత, చెత్త తొలగింపు, నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగించే పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.గతంలో భారీ వర్షాల సమయంలో పలు కాలనీలు నీట మునిగిపోవడం, రోడ్లపై భారీగా వరద నీరు నిల్వ కావడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ముందస్తు చర్యలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. నాలాల్లో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కారణంగా నీటి ప్రవాహం ఆగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా నాలాల విస్తరణ, పక్కగోడల మరమ్మతులు, డ్రైనేజీ మార్గాల శుభ్రపరిచే పనులు కూడా చేపడుతున్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారుల సమీపంలోని నాలాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో జేసీబీల సహాయంతో మట్టిని తొలగిస్తుండగా, పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు.అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పనులను పరిశీలిస్తూ, ఎక్కడైనా నీటి నిల్వ సమస్యలు ఉన్నాయా అనే అంశంపై సమీక్ష నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.స్థానిక ప్రజలు కూడా ఈ చర్యలను స్వాగతిస్తూ, ప్రతి ఏడాది వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలకు ఇది శాశ్వత పరిష్కారంగా మారాలని కోరుతున్నారు. నాలాల్లో చెత్త వేయకుండా ప్రజలు కూడా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు కాలనీల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.వర్షాకాలంలోఎలాంటిఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులు కొనసాగిస్తున్నామని, అవసరమైతే మరిన్ని ప్రాంతాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

# ప్రవేట్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**ముషీరాబాద్, మే 02 (జనం సాక్షి):**తెలంగాణ రాష్ట్రంలో ప్రవేట్ రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆర్ టి సి క్రాస్ రోడ్డు లోని బి.ఎం.ఎస్ కార్యాలయంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్‌బిఎంఎస్ అనుబంధ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, టిఎస్పిటిఎంఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శ్రీధర్ రెడ్డి, బి ఎం ఎస్ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పెంటయ్య గౌడ్ లు ఛలో హైదరాబాద్ మహాధర్నా గోడ పత్రిక ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 5 న ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న చలో మహా ధర్నా లో రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు వాహనాలు స్వచ్ఛందంగా బంద్ చేసి మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి దారుణంగా మారిందని, ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, పోలీస్, ఆర్. టి.ఓ చలనాలు ఎక్కువ అయ్యాయని, ఓలా ర్యాపిడో వంటి యాప్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. అక్రమ బైక్ ల వ్యాపారం కూడా ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కారణమని విమర్శించారు. ఈ సమావేశంలో బిపిటిఎం, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాస్ ఈశ్వర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల సంక్షేమానికి బీఆర్టీయూ ముందడుగు

## ఉప్పల్ నియోజకవర్గంలో 183 మంది డ్రైవర్లకు బీమా రక్షణ పత్రాల పంపిణీ

**ఉప్పల్ మే 02 ( జనం సాక్షి ):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో రవాణా రంగ కార్మికుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని బీఆర్టీయూ (బి ఆర్ టి యూ) నాయకులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 183 మంది డ్రైవర్లకు బీమా సౌకర్యం కల్పిస్తూ సంబంధిత బీమా పత్రాలను అందజేశారు. డ్రైవర్ల భద్రత, వారి కుటుంబాల ఆర్థిక రక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.రోజువారీగా రహదారులపై ప్రయాణించే డ్రైవర్లు ఎన్నో ఇబ్బందులు, ప్రమాదాలు ఎదుర్కొంటూ తమ విధులు నిర్వహిస్తున్నారని, అలాంటి సమయంలో వారికి బీమా రక్షణ ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు జరిగే ఘటనల్లో డ్రైవర్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ బీమా సౌకర్యం ఉపయోగపడుతుందని వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్టీయూ ఎప్పటికప్పుడు ముందుండి పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ, తమ కోసం ప్రత్యేకంగా బీమా సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని చెప్పారు. రవాణా రంగంలో పని చేసే కార్మికులకు ఇలాంటి భద్రతా పథకాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. బీమా సౌకర్యం వల్ల తమ కుటుంబాలకు భరోసా కలుగుతుందని, ఏదైనా ప్రమాదం జరిగినా ఆర్థిక పరంగా కొంత రక్షణ లభిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, డ్రైవర్లు సమాజానికి కీలకమైన సేవ అందిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరియు సంబంధిత సంస్థలు మరింత దృష్టి పెట్టాలని కోరారు. డ్రైవర్లకు బీమా, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ నాయకులు, డ్రైవర్లు, కార్మిక సంఘ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా కాకుండా, డ్రైవర్లలో భద్రతపై అవగాహన పెంచే విధంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.

# ఎర్లీ బర్డ్ రాయితీతో జీహెచ్‌ఎంసీకి భారీ ఆదాయం

## ఉప్పల్, హబ్సిగూడలో ఆస్తి పన్నుల వసూళ్ల జోరు




**ఉప్పల్ మే 02 ( జనం సాక్షి ):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అమలు చేసిన 'ఎర్లీ బర్డ్' ఆస్తి పన్ను రాయితీ పథకానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా ఉప్పల్, హబ్సిగూడ సర్కిళ్లలో ఆస్తి పన్నుల చెల్లింపులు భారీగా నమోదై జీహెచ్ఎంసీకి గణనీయమైన ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.గడువు ముగిసే చివరి రోజుల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పన్నులు చెల్లించేందుకు ముందుకు రావడంతో సంబంధిత సర్కిల్ కార్యాలయాలు రద్దీగా మారాయి. ముందస్తుగా పన్ను చెల్లించిన వారికి రాయితీ కల్పించడం ఈ స్కీమ్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దీంతో గృహ యజమానులు, వ్యాపార సంస్థలు తమ బకాయిలను త్వరితగతిన చెల్లించినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ వసూళ్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది. ముఖ్యంగా ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ పనులు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.ప్రజలు సమయానికి పన్నులు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి భాగస్వాములు కావాలని జీహెచ్ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మండే ఎండల్లో మజ్జిగ పంపిణీ



**అంబర్పేట్ మే 2 (జనం సాక్షి)** అంబర్పేట్ చెందిన ఓ రాజకీయ సంస్థ కు చెందిన యువకులు స్వచ్ఛందంగా మజ్జిగను పంపిణీ చేశారు. మండే ఎండలో చల్లటి ఉపశమనం కోసం మజ్జిగను పంపిణీ చేశారు. అంబర్పేట్ మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన యువకులు రోడ్డుపై వెళుతున్న పలువాహన చోదకులకు మరియు పాదాచారులకు చక్కటి,చిక్కటి, చల్లని మజ్జిగను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ సమాజసేవలో మనందరం భాగస్వాములు కావాలని ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో ఇంకా చేపడతామని తెలియజేశారు. యువత చెడు ఆలోచనల వైపు పయనించకుండా ఆదర్శవంతంగా ఉండాలని తెలియజేశారు.

## ఖానాపూర్ అండర్ పాస్
# రెండు వైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి
### ఎంపీకి వినతి పత్రం ఇచ్చిన సర్పంచ్ గ్రామస్తులు



**చేవెళ్ల, మే 02 (జనంసాక్షి)** చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గేట్ వద్ద నేషనల్ హైవే అండర్ పాస్, రెండు వైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని నాంచేరి గ్రామ సర్పంచ్ అశోక్, బిజెపి సీనియర్ నాయకులు గొటూరి జయ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం చేవెళల్లో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, నేషనల్ హైవే అధికారులను నాంచేరి, ఖానాపూర్, ఆలూరు గ్రామస్తులతో కలిసి వినత్రి పత్రం అందజేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉన్న రైతులను దృష్టిలో పెట్టుకొని రెండు వైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు బస్ స్టాప్ దగ్గరికి వెళ్లడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, చేవెళ్ల మున్సిపల్ బిజెపి అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి, నాయకులు మాణిక్యరెడ్డి, శరవలింగం, ఉమా శంకర్, పూర్ణచందర్, నాంచేరి, ఖానాపూర్, ఆలూరు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకుల సమావేశంలో పాల్గొన్న
# షాబాద్ మాజీ జెడ్పీటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి



**షాబాద్, మే 02(జనం సాక్షి) :** వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించే దిశగా నాయకులు జిల్లాల్లో పార్టీ బలోపేతం లో కృషి తప్పనిసరి అని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాదులోని నంది నగర్ నివాసంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకులతో శనివారం పార్టీ బలోపేతం, రానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం కమిటీల నిర్మాణం వంటి అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లా లో రాజేంద్రనగర్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, షాబాద్ మాజీ జెడ్పీటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి నేతృత్వంలో పార్టీ బలోపేతం వంటి అంశాలను చర్చించి సభ్యత్వ నమోదు గురించి ప్రత్యేక శ్రద్ధ వహించి కమిటీల ద్వారా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణి దేవి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, కొప్పుల మహేశ్వర్ రెడ్డి, మోత్కు ఆనంద్, దేశముల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విగ్రహా ప్రతిష్టాపన, బోనాల ఊరేగింపు



**బొంరాస్ పేట, మే 2(జనం సాక్షి):** మండల పరిధిలోని ఏర్పుమల్ల గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ గండెమ్మ మాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శనివారం అమ్మవారి ఆలయం సమీపంలో అఖండ దీపారాధన, గణపతి పూజ, చండీ హోమం కార్యక్రమాలు ఘనంగా కన్నుల పండుగగా జరిగాయి. అనంతరం సాయంత్రం అమ్మవారి విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, అన్నదాన కార్యక్రమము,సాయంత్రం బోనాల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు సందారం లక్ష్మయ్య తెలిపారు.గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా తరలిరావాలన్నారు.

## తండ్రి గుర్తుగా వచ్చిన ఉద్యోగాన్ని వదులుకోలేక
# కుటుంబానికి దూరంగా సేవలందించిన లావణ్యరెడ్డి



**హయత్ నగర్, మే 2 (జనం సాక్షి)** హయత్‌నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎ. లావణ్య రెడ్డి ఏప్రిల్ 30వ తారీఖున స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనే ఉద్యోగంలో చేరిన లావణ్య అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి చేరుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకం అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్ బాబు అభినందించారు. ఉద్యోగరీత్యా భర్త అమెరికాలో స్థిరపడడం, పిల్లలు కూడా అక్కడికే చేరుకున్న కారణాన లావణ్య కూడా అక్కడికి వెళ్లాలనుకున్నారు. అలా వెళ్లాలంటే పదవీ విరమణ చేయవలసి ఉంటుంది. తండ్రి వారసత్వంగా వచ్చినటువంటి ఉద్యోగాన్ని వదులుకోవడానికి ఆమె ఇష్టపడలేదు. అలాగని కుటుంబానికి దూరంగా ఉండాలని కూడా అనుకోలేదు. తండ్రి గుర్తుగా వచ్చిన ఉద్యోగం గుర్తింపు పొందేలా, 20 సంవత్సరాల సర్వీసు పూర్తయ్యేదాకా ఉద్యోగంలో కొనసాగారు. అమెరికాలో ఉన్న కుటుంబాన్ని చేరుకోవడానికి ఇంకో 20 సంవత్సరాలకు పైగా సర్వీసు మిగిలి ఉండగానే ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉన్నా కూడా వాటన్నింటినీ కుటుంబం కోసం వదులుకోవడం చాలా గొప్ప త్యాగం అని కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది కొనియాడారు. కళాశాలలో పనిచేసిన కాలంలో కళాశాలనే తన కుటుంబంగా భావించి అందరితో హృదయపూర్వకంగా మెలుగుతూ పనిచేసిన విధానాన్ని అందరూ అభినందించారు. లావణ్య ని శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, లావణ్య పనిచేసిన పూర్వ కళాశాలల మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడుదాం
# 8 గంటల పని దినాన్ని రక్షించుకుందాం






**హయత్ నగర్, మే 2 (జనం సాక్షి)** కార్మిక హక్కులు హరించే "నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై పోరాడుదాం 8 గంటల పని దినాన్ని రక్షించుకుందాం" కార్మిక ఉద్యమం పై జరుగుతున్న నిర్బంధాన్ని ప్రతికటిద్దాం. వనస్థలిపురం రైతు బజార్ చిరు వ్యాపారస్తుల, తోపుడుబండ్ల కార్మిక యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కోశాధికారి తడబోయిన కృష్ణమూర్తి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కులను హరిస్తున్న 4 లేబర్ కోడ్ ల రద్దుకై మీరే స్ఫూర్తితో పోరాడుదాం అని అన్నారు. కేంద్రంలో మోడీ నాయకత్వం లోనే బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నుండి నేటి వరకు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత కార్మిక వర్గంలో త్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని దినం సమ్మె హక్కు, కార్మికుల అవసరాలకు అనుగుణంగా జీతభత్యాలు, సంక్షేమ పథకాలు లాంటివి కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 29 కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్ లను వచ్చాయి, మళ్లీ బ్రిటిష్ కాలం లాంటి ఆటవిక పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆనాడు 8 గంటల పని దినం 1886 సం. లో అమెరికా చీకాగో అమరవీరుల త్యాగాల స్ఫూర్తిని తీసుకొని 140 వ మేడేను పోరాట దినంగా 2026 మే 1 నుండి ఏడు వరకు వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కార్మికవర్గానికి వారు పిలుపునిచ్చారు.

# ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి
### జోనల్ కమీషనర్ వికాస్ మహతోను కోరిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి



హయత్ నగర్, మే 2 (జనం సాక్షి) ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం తగిన నిధులు మంజూరు చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని ఇటీవల మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో ను జక్కిడి శివచరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి లేఖను వారికి అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం కొంత కాలంగా పలు మౌలిక సదుపాయాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వాటిని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని కమిషనర్ ను కోరారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్న మంత్రి శ్రీధర్ బాబు, జోనల్ కమీషనర్ వికాస్ మహతో లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు యరమల రామచంద్ర రెడ్డి, జక్కిడి సత్యతేజ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మర్పల్లి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్
# విద్యార్థుల పది పరీక్షల్లో విజయ కేతనం




**మర్పల్లి మే 02 (జనంసాక్షి)** ఈ గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది పాఠశాల మొత్తం 97.4% ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల మొదటి స్థానం లో విద్యార్థుల ఆర్. నిఖిత: 600 మార్కులకు గాను 532 మార్కులు సాధించింది. రెండో స్థానంలో. కె. గౌతమ్: 503 మార్కులతో రెండో స్థానం సాధించింది. .కె. మేనక 496 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిలయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మర్పల్లి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో 97.4% ఉత్తీర్ణత సాధించడం గర్వకారణం. క్రమశిక్షణతో కూడిన చదువు, ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ వల్లే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయి" అని పేర్కొన్నారు. ముఖ్యంగా 532 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన ఆర్. నిఖిత, పాఠశాల పేరును నిలబెట్టారని కొనియాడారు. రాబోయే రోజుల్లో విద్యార్థులందరూ ఇదే స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయంలో పాలుపంచుకున్న ఉపాధ్యాయ బృందానికి మరియు తోడ్పాటునందించిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బిజేపిలో చేరిన సామాజిక సేవకుడు శ్రీరామ్ వెంకటేష్



**సికింద్రాబాద్(జనంసాక్షి):** తార్నాకాకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త శ్రీరామ్ వెంకటేష్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ మేరకు శనివారం తార్నాక స్ట్రీట్ నెంబర్ 3లోని ఆయన నివాసం నుంచి దాదాపు 200 మందితో భారీ ర్యాలీ చేపట్టారు. మూడు రంగులు జెండాలు, కాషాయ జెండాలతో ద్విచక్ర వాహన ర్యాలీగా బయలుదేరి బర్కత్పురలోని బిజేపి సిటీ కార్యాలయం వరకు చేరుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో శ్రీరామ్ వెంకటేష్ బిజేపిలో చేరారు. అంతకంటే ముందుగా తార్నాకలోని తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ సమర్థవంతమైన పరిపాలనకు ఆకర్షితులమై బిజేపిలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. ఇన్ని రోజులు ఒక వ్యక్తిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని గుర్తు చేశారు. ఇప్పటి నుండి బీజేపీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ అభివృద్ధి దిశగా పని చేస్తానని తెలిపారు.

## పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

### ప్రిన్సిపాల్ బి. రామదాసు



**కొడంగల్ ,02 మే ( జనం సాక్షి):** పదవ తరగతి ఫలితాలలో కొడంగల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి రామదాసు తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రిన్సిపాల్ బి రామదాసు మాట్లాడుతూ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 65 మంది విద్యార్థులకు 65 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో 500 కు పైగా 16 మంది విద్యార్థులుమార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో 540 మార్కులు పొందిన సోలోమన్,537 మార్కులు పి సన్నీ, 533 మార్కులు భవాని ప్రసాద్, మరియు 533 మార్కులు వరుణ్ సందేశ్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.రామదాసు మాట్లాడుతూ 100శాతం పదవ తరగతి ఫలితాలు విద్యార్థులు సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు మరియు సీనియర్ ఉపాధ్యాయులు అయోధ్య రామయ్య ,పద్మ , రేష్మబేగం ,ఉపాధ్యాయ బృందాలు అభినందనలు తెలిపారు.

# లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్‌గా ఏ. అమర్‌నాథ్ రావు ఎన్నిక



**శామీర్ పేట్, మే (జనం సాక్షి)** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉన్న 8 లయన్స్ జిల్లాల కు చెందిన 320 మల్టిపుల్ కౌన్సిల్ 11 వ చైర్మన్ గా 320డి జిల్లా గవర్నర్ లయన్ ఏ. అమర్నాథ్ రావు ఎన్నికయ్యారు. హైదరాబాద్ నగర శివారు శామీర్ పేట ఎస్ ఎస్ ఎన్ ఆర్ కన్వెన్షన్ లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎన్నికైనట్లు ప్రస్తుత చైర్మను టి రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన మే 2, 3 తేదీలలో మల్టీపుల్ పదవ మహాసభలు నిర్వ హిస్తున్నారు. కౌన్సిల్ 11 వ చైర్మన్ గా ఎన్నికైన లయన్ అమర్నాథ రావు విద్యా రంగం, లయనిజం రెండింటిలోనూ దూరదృష్టి కలిగిన మహోన్నత వ్యక్తిత్వం గల నాయకుడు. మార్పుకు మార్గ దర్శకుడైన ఉపాధ్యాయుడిగా, ప్రేరణనిచ్చే నాయకుడిగా, సంబంధాలను బలపరిచే సేతువుగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వృత్తి రీత్యా ఒక నిబద్ధత గల పాఠశాల ఉపాధ్యాయు డైన ఆయన, వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమ ప్రతిభ కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో విశేష పాత్ర పోషించారు. దాతల సహకారంతో దాదాపు 60 లక్షల రూపాయల నిధులను సమీకరించి జడ్ పి హెచ్ ఎస్ మార్కుక్ పాఠశాలను అభివృద్ధి చేయడం, అలాగే జిల్లా పరిషత్ ములుగు పాఠ శాలలో ఆయన చేసిన సేవలు విద్యాపట్ల ఆయన అంకితభావానికి నిలువెత్తు నిదర్శనాలు. విద్యా వేత్తగా, నాయకుడిగా, శిక్షకుడిగా, మానవతా వాదిగా ప్రతి బాధ్యతలోనూ లయన్ అమర్‌నాథ్ రావు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తూ ముందుకు సాగుతున్న అమర్నాథ్ రావు కౌన్సిల్ చైర్మన్ గా ఎన్నిక కావడం పట్ల మల్టిపుల్ అగ్రనాయకులు డా. బాబు రావు, ఆర్. సునీల్ కుమార్, జిల్లాల గవర్నర్లు, వైస్ గవర్నర్లు, పూర్వ గవర్నర్లు మల్టిపుల్ పి.ఆర్ఓ కన్న పరశురాములు, 320డి జిల్లా క్యాబినెట్ కార్యదర్శి ఎల్ శ్రీనివాస్ రెడ్డి, క్యాబినెట్ కోశాధికారి మర్రి ప్రవీణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. 2ఎస్పీటీ – ఎస్ ఎన్ ఆర్ కన్వెన్షన్ లో చైర్మన్ గా అమర్నాథ్ రావు దంపతులుద.

# ఫుట్ పాత్ ఆక్రమణపై కఠినంగా వ్యవహరిస్తాం




**శేరిలింగంపల్లి, మే 02 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో రోడ్ల ఆక్రమణలు, పేవ్ మెంట్ల పై తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేయడం, వాటిని ఆక్రమించడం వంటి దుశ్చర్యలను తాము ఎట్టి పరిస్థితులలోను సహించబోమని, వాటి నిర్మూలనకు కఠినంగా వ్యవహరిస్తామని శేరిలింగంపల్లి సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోనీ గచ్చిబౌలి టెలికం నగర్ నుంచి ఉర్దూ యూనివర్సిటీ వరకు ఉన్న ఆక్రమణలను శనివారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సాయి తేజ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. సర్కిల్ పరిధిలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత ఆధునీకరణ చోటుచేసుకుంటున్నందున, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రజల ఆలోచన విధానం కూడా మారాలని, సాటి ప్రజలకు ఇబ్బంది కలిగించే వ్యవహారాలు నిర్మూమాటంగా తగ్గించుకుంటే ఉత్తమమని, రోడ్లను ఆక్రమించేస్తాం, ఫుట్పాతలపై బలవంతంగా షాపులను నిర్వహిస్తామని ఎవరైనా అనుకుంటే అది వారికి హాస్యాస్పదమైనని అధికారులు స్పష్టం చేశారు. ఫుట్పాత్లను ఆక్రమించడమే నేరమని, ఆపై వాటిని నిర్మూలించే సమయంలో రాజకీయ ఒత్తిళ్లు, బలవంతంగా అడ్డుకోవడం వంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ఆక్రమణదారులపై తాము కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి శనివారం ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడుతున్నామని, మునుముందు కూడా ఈ కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుందని టిపిఎస్ సాయి తేజ స్పష్టం చేశారు. కాగా టెలికాం నగర్ ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో చైన్మెన్లు మోహన్, మహారాజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యూపీవీసీ యూనియన్ ప్రత్యేక సమావేశం

- దేవి గ్రాండ్ హోటల్‌లో గ్లాస్ అల్యూమినియం యూపీవీసీ యూనియన్ ప్రత్యేక సమావేశం
- షాపుల యజమానులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించిన యూనియన్ అధ్యక్షుడు కాసోజు శివ



**జనం సాక్షి (ఫరూఖ్ నగర్ )**రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల కేంద్రం లోని దేవి గ్రాండ్ హోటల్ లో జరిగిన గ్లాస్ అల్యూమినియం మరియు యూపీవీసి యూనియన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు కాసోజు శివ షాపుల యజమానులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందివ్వటం జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షులు కాసోజు శివ మాట్లాడుతూ షాద్ నగర్ పరిసర ప్రాంతం లో ఉన్న షాప్ యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరు కూడా కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలని కస్టమర్లకు ఇబ్బందులకు గురి చేయరాదని సకాలంలో పనులు పూర్తి చేయాలని షాపు యజమానులకు యూనియన్ సభ్యులందరికీ తెలియజేశారు.అంతే కాకుండా వినియోగదారులు కూడా పనులు చేయించుకున్న తర్వాత పనులు చేసిన వారికి ఇబ్బందులకు గురి చేయకుండా సహకరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.అంతేకాకుండా షాపు యజమానులు పనులు చేసే వారు ఎవరైనా యూనియన్ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకొని పనులు చేయవలసిందిగా అధ్యక్షులు కాసోజు శివ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాపుల యజమానులు శ్రీనివాస్ చారి, అహ్మద్, సోహెల్, చందులాల్, జియారాం తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ మల్లికార్జున్‌కు అంతర్జాతీయ గౌరవం



**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** మాజీ రక్షణ మంత్రి డాక్టర్ మల్లికార్జున్ కు అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచంలో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఇటలీలోని బొలోనియాలో ఉన్న జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (ఎస్ఏఐఎస్) క్యాంపస్‌లో కొత్తగా నిర్మించిన టెర్రస్‌కు 'డాక్టర్ మల్లికార్జున్ టెర్రస్' అని పేరు పెట్టారు. ఇది అంతర్జాతీయ స్నేహ సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. ఈ టెర్రస్ ను ఎస్ఏఐఎస్ యూరప్ క్యాంపస్ భవన విస్తరణలో భాగంగా నిర్మించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులు, ప్రముఖులు పరస్పరం కలుసుకునే వేదికగా ఉపయోగపడుతుంది. డాక్టర్ మల్లికార్జున్ 1969 తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా ప్రజా జీవితంలో ప్రవేశించారు. అనంతరం రక్షణ, రైల్వే వంటి కీలక కేంద్ర మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. ఆయన ఆరు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. రెండుసార్లు మెదక్ లోకసభ నియోజకవర్గం, నాలుగు సార్లు మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. జీవితాంతం తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం పాటుపడ్డారు. కాంగ్రెస్ ఫోరం ఫర్ తెలంగాణ స్థాపించారు. దీనికి నాయకత్వం వహించారు. ప్రపంచ స్థాయి వైద్య పరిశోధనలో ముందంజలో ఉన్న జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వంటి సంస్థ ఆయనకు ఈ గౌరవాన్ని అందించడం విశేషం. డాక్టర్ మల్లికార్జున్ హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ లో వైద్య విద్యను అభ్యసించిన విషయం విదితమే.

డాక్టర్ మల్లికార్జున్ కుమారుడు మను మల్లికార్జున్ జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (ఎస్ఏఐఎస్)లో ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో ఎంఏ పూర్తి చేశారు. పూర్వ విద్యార్థిగా ఈ ప్రత్యేక గౌరవ కార్యక్రమానికి తన వంతుగా సహకరించారు. బొలోనియాలో ఎస్ఏఐఎస్ లో మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో ఆయన స్టూడెంట్ గవర్నమెంట్ అసోసియేషన్ (ఎస్జీఏ)కు ఎన్నికయ్యారు. ఈ సమయంలో విశేషంగా సేవలందించారు. రెండో సంవత్సరంలో ఆయన వాషింగ్టన్ డీసీలో చేశారు. క్యాంపస్‌లో జరిగిన ఫలకావిష్కరణ కార్యక్రమంలో ఎస్ఏఐఎస్ యూరప్ రెక్టర్ రెనోడ్ డెహౌస్ సమక్షంలో మను మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మను మల్లికార్జున్ మాట్లాడుతూ ఇది 'మనం దేశాలుగా, ప్రజలుగా కంటే ముందు మానవులం' అనే విషయాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ఇది ప్రతీకాత్మకమైనదే కావచ్చు, కానీ శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. ఆ ఫలకంపై ఇలా రాసి ఉంది. భారత్ లోక్‌సభ సభ్యులు, మాజీ మంత్రి, డాక్టర్ మల్లికార్జున్ (1941-2002) జ్ఞాపకార్థం. ఉస్మానియా మెడికల్ కాలేజీలో విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పని చేసిన ఆయన ప్రస్థానం, ప్రజా సేవ, నాయకత్వం పట్ల ఆయనకున్న అంకితభావానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# హైకోర్టు న్యాయమూర్తుల స్వీయ గణన పూర్తి

## ప్రజలకు ఆదర్శంగా నిలిచిన న్యాయమూర్తులు




**ఖైరతాబాద్, మే 02 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో స్వీయ గణన కార్యక్రమానికి హైకోర్టు న్యాయ మూ ర్తులు చురుకుగా స్పందిస్తూ ఆదర్శంగా నిలిచారు. జస్టిస్ చాడా విజయ భాస్కర్ రెడ్డి స్వీయ గణనను విజయవంతంగా పూర్తి చేశారు. జస్టిస్ మోస్సమ్మి భట్టాచార్య మేడమ్ ప్రస్తుతం ఔట్ ఆఫ్ స్టేషన్‌లో ఉన్నందున సమర్పణ తరువాత చేయనున్నట్లు సమాచారం.ఇక జస్టిస్ మాధవి దేవి, జస్టిస్ కె. శర త్, జస్టిస్ కె. సృజనా, జస్టిస్ ఎన్. తుకారంజీ, జస్టి స్ నాగేశ్ భీమపాక కూడా స్వీయ గణన ప్రక్రియలో భాగస్వాములై పూర్తి చేసినట్లు అధికారులు తెలి పారు. న్యాయమూర్తులు స్వయంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం సమాజా నికి మంచి సందేశాన్ని అందిస్తున్నదని పేర్కొన్నా రు.జూబ్లీహిల్స్ సర్కిల్-36 డిప్యూటీ కమిషనర్ శంకర్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సమ ర్థవంతంగా కొనసాగింది. అధికారులు ఏఎంసీ ఖైలాష్ తోపాటు ఇతర సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు .ప్రజలందరూ కూడా స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొని బాధ్యతగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# వైభవంగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**తలకొండపల్లి, మే 02(జనంసాక్షి) :** చౌదర్‌పల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.రెండవ రోజు శనివారం గణపతి ప్రార్థన యాగశాల ప్రవేశము,మండప పూజలు,ఆవహిత దేవత ఆవనములు, భక్తులచే గణపతి మృత్యుంజయ,మహా సుదర్శన హోమము, ఏకశిలా 81కలశములతో అభిషేకము,పుష్ప సహిత," శయ్యదివాసము"ప్రదోష పూజ,మంగళ హారతి,మంత్ర పుష్పము తీర్థ ప్రసాద వితరణ,పూజా కార్యక్రమాలు వేద పండితులు గూడ నరసింహ శర్మ,గూడ శ్రీనివాసమూర్తి,ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద మంత్రోచ్ఛరణల మధ్యన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడవరోజు ఆదివారం గణపతి,శ్రీ ఆంజనేయ స్వామి, సీతారామచంద్రస్వామి విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో భక్తులు,గ్రామ ప్రజలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ఘనంగా రెజెన్సీ లీడర్షిప్ అవార్డ్స్ వేడుక


## హాస్పిటాలిటీ రంగ దిగ్గజాలకు సత్కారం




**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** ఆతిథ్య రంగంలో ప్రతిభను ప్రోత్సహిస్తూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా రెజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యూలినరీ ఆర్ట్స్ ఽ హోటల్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో 'రెజెన్సీ లీడర్షిప్ అవార్డ్స్ 2025--26' వేడుక తారామతి బారాదరిలో ఘనంగా నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ అయిన రెజెన్సీ కాలేజ్ నిర్వహించిన ఈ వేడుకలకు ప్రభుత్వ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ వాణి ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రెజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యూలినరీ ఆర్ట్స్ ఽ హోటల్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ పీ రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హాస్పిటాలిటీ రంగంలోని దిగ్గజాలు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులను గుర్తించడం, ప్రోత్సహించడం లక్ష్యమన్నారు. అధ్యాపక వర్గం నిరంతర శిక్షణ, సృజనాత్మక విధానాల అమలు ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న హోటల్ మేనేజ్మెంట్ కాలేజీలకు కొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నామని తెలిపారు. ఈ కళాశాల నుంచి ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులు అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లలో జనరల్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ చెఫ్స్, విభాగాధిపతులుగా ఉన్నత స్థానాలు అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్నారు. పదో తరగతి లేదా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు హోటల్ మేనేజ్మెంట్, క్యూలినరీ ఆర్ట్స్ కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. హాస్పిటాలిటీ రంగంపై ఆసక్తి ఉన్న వారికి ఈ డిగ్రీలు భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. ఈ కోర్సుల్లో నేర్చుకునే నైపుణ్యాలు జీవితంలోని అన్ని రంగాల్లో ధైర్యవంతమైన నాయకులుగా ఎదగడానికి సహాయపడతాయని వివరించారు. హోటల్ మేనేజ్మెంట్, క్యూలినరీ ఆర్ట్స్ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు కలవన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం ప్రొఫెసర్ గడ్డం నరేష్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎస్ జితేంద్ర కుమార్ నాయక్ హాజరయ్యారు.

# డాలర్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు దీన్దయాల్ గుప్తా కన్నుమూత

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** ప్రముఖ పారిశ్రామికవేత్త, డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎమెరిటస్ దీన్దయాల్ గుప్తా వయోభారంతో కూడిన అనారోగ్యంతో కోల్కతాలో కన్నుమూశారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, మనవళ్లు ఉన్నారు. ప్రస్తుతం వారు డాలర్ ఇండస్ట్రీస్ వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ఆయన మరణం హోసియరీ, వస్త్ర పరిశ్రమకు తీరని లోటుగా భావిస్తున్నారు. దూరదృష్టి గల నాయకుడిగా, మార్గదర్శకుడిగా నిలిచిన గుప్తా ఐదు దశాబ్దాలకు పైగా డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ను నడిపించారు. చిన్న స్థాయి నుంచి దేశంలోని ప్రముఖ హోసియరీ, అపెరల్ తయారీ సంస్థలలో ఒకటిగా ఎదిగింది. ఆయన మార్గదర్శకత్వంలో డాలర్ ఇండస్ట్రీస్ రూ. 1700 కోట్లకు పైగా వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించింది.



1937 సెప్టెంబర్ 13న హర్యానాలోని భివానీ జిల్లా మన్హేరు గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించారు. 1962లో కోల్కతాకు వలస వెళ్లారు. 1972లో డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్కు పునాది వేశారు. ఆయన వ్యాపార దృష్టి, నిరంతర కృషి సంస్థను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. కొద్ది కాలంలోనే మధ్యప్రదేశ్ (ప్రస్తుతం మధ్యప్రదేశ్ ఽ ఛత్తీస్గఢ్), ఈశాన్య భారతదేశంలోని సెవెన్ సిస్టర్స్ రాష్ట్రాలు, తూర్పు హిమాలయాల్లోని దార్జిలింగ్ వంటి కొండ ప్రాంతాలకు సరఫరా చేసిన తొలి సంస్థలలో ఒకటిగా నిలిచింది. ఆయన సామాజిక సేవలో కూడా చురుకుగా పాల్గొనేవారు. ఆర్య ప్రతినిధి సభతో ఆయనకు ఎంతో అనుబంధం ఉండేది. ఇది ఆయన సమాజ సేవ పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. బెంగాల్ ప్రతినిధి సభలో అనేక శాఖల్లో కీలక నాయకుడిగా సేవలందించారు. సర్వదేశిక ఆర్య ప్రతినిధి సభకు ఉపాధ్యక్షుడిగా పని చేశారు. అజ్మీర్లోని పరోపకారిణి సభలో కూడా సభ్యుడిగా ఉన్నారు. ఇది స్వామి దయానంద సరస్వతి వ్యక్తిగత అవశేషాల ప్రధాన నిల్వగా గుర్తింపు పొందింది. కోల్కతాలోని మార్వారి రిలీఫ్ సొసైటీ వద్ద బర్న్ యూనిట్, సంబంధిత మౌలిక వసతుల స్థాపనకు శ్రీకారం చుట్టారు.

విద్యారంగంలో కూడా ఆయన విశేష కృషి చేశారు. పశ్చిమ బెంగాల్లోని నార్త్ 24-పరగణా జిల్లా బిధాన్నగర్లో ఉన్న హర్యానా విద్యా మందిర్ పాఠశాల స్థాపకుల్లో ఒకరు. సీబీఎస్ఈ బోర్డుకు చెందిన ఈ పాఠశాల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. గురుకులాల స్థాపనలో సహ వ్యవస్థాపకుడు, స్పాన్సర్గా కూడా ఉన్నారు. తన స్వగ్రామం మన్హేరులోని పాఠశాల పునరుద్ధరణకు కృషి చేశారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలని ఆయన కోరుకునేవారు. మహర్షి దయానంద యోగాశ్రమ్ త్రిపుర, సుఖానంద ఫౌండేషన్ వంటి వృద్ధుల సేవా సంస్థల అభివృద్ధికి తోడ్పాటు అందించారు. తన విశిష్ట ప్రస్థానంలో ఆయన అనేక పురస్కారాలు, గౌరవాలు అందుకున్నారు. వాటిలో వెస్ట్ బెంగాల్ హోసియరీ అసోసియేషన్ నుంచి లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డు, సంమార్గ్ బిజినెస్ అవార్డు ముఖ్యమైనవి.

# జిహెచ్ఎంసిలోలో ఎల్ఆర్ఎస్ -2020 హెల్ప్ డెస్క్‌లు ప్రారంభం

## 25% రాయితీ గడువు జూలై 31 వరకు




**ఖైరతాబాద్, మే 02,(జనం సాక్షి) :** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జిహెచ్ఎంసి పరిధిలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎన్ ఆర్ ఎస్ -2020) దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గతంలో జారీ చేసిన జీవో. ఎమ్మెస్ నెంబర్.28 (20.02.2025) ప్రకారం ఎల్ఆర్ఎస్ ఫీజులు, ప్రోరాటా ఓపెన్ స్పేస్ ఛార్జీలపై 25% రాయితీ కల్పించగా, ఆ గడువు ముగిసి న నేపథ్యంలో తాజాగా జీవో ఎంఎస్ నెంబర్ 131 29.04.2026 ద్వారా ఈ రాయితీ సౌకర్యాన్ని మ రో మూడు నెలలు పొడిగించింది. ఈ మేరకు 01-05-2026 నుంచి 31-07-2026 వరకు పౌరులు 25% రాయితీతో ఫీజులు చెల్లించే అవకాశం కల్పిం చబడింది.ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని అన్ని సర్కిల్ కార్యాల యాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు, కాల్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వేగవంత మైన పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్‌లు, మేళాలుని ర్వహించనున్నారు.ఈ మేరకు శనివారం ఖైరతాబాద్ జోనల్ సీపీ శ్రీనివాస్ పలువురు నుంచి దరఖా స్తులు స్వీకారిశీచారు. ప్రతి సర్కిల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ఏర్పాటు చేసి, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.ఈ హెల్ప్ డెస్క్‌లు ప్రతిరోజు పని దినాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తూ పౌరుల కు సేవలు అందించనున్నాయి.దరఖాస్తుదారుల కు అప్లికేషన్ స్థితి, ఆమోదాలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులపై మార్గదర్శనం అందించడంతో పాటు, ఎల్ఆర్ఎస్ పోర్టల్ వినియోగంపై సహాయం, అదనపు వివరాల కోసం హెల్ప్‌లైన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. జిహెచ్ఎంసి పరిధిలోని పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకుని, ప్రభుత్వం కల్పించిన 25% రాయితీ తో ూ=ూ-2020 కింద తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లాన్ సిబ్బంది పాల్గొన్నారు.



# దళారులను నమ్మి మోసపోవద్దు

## కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్ మే 02(జనంసాక్షి):** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతన్నలు మోసపోవద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.కడ్తాల్ మండల కేంద్రంలో జిల్లా పౌరసరఫరాల శాఖ సహకారంతో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమనగల్ మార్కెట్ చైర్పర్సన్ యాట గీతా నర్సి శీహ్మా,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,సర్పంచ్ రాయికంటి బిక్షపతి,ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి,మండల మహిళా సంఘం అధ్యక్షురాలు,లతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారని, రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని,సన్నగుడ్లకు క్వింటాల్‌కు రూ.500 ప్రభుత్వం బోనస్ అందిస్తుందని చెప్పారు.రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. కేంద్రాల వద్ద నిర్వాహకులు రైతులకు తగిన ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్,అధికార ప్రతినిధి బాలాజీ సింగ్,డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యా నాయక్,వార్డు సభ్యులు భాను కిరణ్,పిఏసిఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేష్,నాయకులు చందోజి,జహంగీర్ బాబా,జాంగిర్ అలీ,వెంకట్ రెడ్డి,దారెడ్డి అంజన్ రెడ్డి, రాములు, బిక్షపతి, ఏపీఎం రాములు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వేసవి తాపం తోడుగా మూళ్ళ నాచు నష్టంలో మత్స్యకారులు

**భూత్పూర్ ఏప్రిల్ 02(జనం సాక్షి ):** మహబూబ్నగర్ జిల్లా భూత్పూర్ మండలం లో మద్దిగట్ల మరియు పాతమొలుగరా. వెల్కిచర్ల. కప్పేట గ్రామాలలో చెరువు లలో చేపలు మృత్యువాత పడ్డాయి చేపల జాలరులు మాట్లాడుతూ వేసవి కాలం అధిక వేడిమి కారణం గా చెరువు లో నీటి మట్టం తగ్గడం వలన నీరు వేడి అయ్యి చేపలు చనిపోతున్నవి. వాటిని తొందరగా పట్టి మార్కెటింగ్ చేయడానికి వీళ్ళు లేకుండా మూళ్ళ నాచు తోడు కావటం తో చేపలు పట్టడానికి రావటం లేదని వల్లలు కనీసం నీటి అడుగుకి చేరాకపోవడంతో చేపలు చిక్కడం లేదని దాని వలన అధిక నష్టం జరుగుతుంది అని వాపోయారు. మూళ్ళ నాచు సమస్య ప్రస్తుతం చాలా తీవ్రంగా ఉండటం వల్ల నీటిలో ఆక్సిజన్ అందక చేపలు చనిపోతున్నాయి ఈ సమస్య గత ఐదు సంవత్సరాల నుండి ఎక్కువగా ఉన్నది.ప్రస్తుతం ఎండ కాలం కావడంతో అన్ని చెరువులలో ఒక్కేసారి చేపలు పట్టుతుండడంతో మార్కెట్ లో కూడా ధర రావటం లేదని కావున ప్రభుత్వం మూళ్ళ నాచు నివారణకు కావలసిన కనీసం అవగాహన సాధస్సులు ఏర్పాటు చేయాలనీ దాని వలన మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పడుతుందని తమ బాధను జనం సాక్షి తో పంచుకున్నారు

# మతిస్థిమితం లేని వ్యక్తి మృతి




**మహేశ్వరం,మే2(జనంసాక్షి):** మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిమామిడి గ్రామంలో కోట మైసమ్మ గుడి సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది.స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వెంకటయ్య చారి (60)కందుకూరు మండలం పులిమామిడి, పరిసర గ్రామాలల్లో రోడ్డు వెంట భిక్షాటన,మద్యం సేవిస్తూ రోడ్డు పక్కన నివసిస్తూ ఉండేవాడు. వెంకటయ్య చారి మానసిక స్థితి సరిగా లేదు.అప్పుడప్పుడు మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేవాడు.శనివారం ఉదయం పులిమామిడి గ్రామంలోని కోట మైసమ్మ గుడి సమీపంలో శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.మృతుని కుటుంబ సభ్యులు గుర్తించే వరకు మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.మృతిని వివరాలు ఎవ్వరికైనా సమాచారం తెలిస్తే 8712662687,8712662409,8712662369 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక లాభాలు పొందాలి

**యాచారం,మే2(జనం సాక్షి) :** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక లాభాలు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ వరప్రసాద్ అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని గున్గల్ గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులు వచ్చే పంటను రైతులు సాగు చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ రంగంలో మెలకువలు పాటించాలని సేంద్రియ ఎరువులను వాడి యూరియా వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని పంట మార్పిడి విధానాన్ని రైతులు అలవర్చుకోవాలన్నారు.

# దేశమే దేహం.. ధర్మమే ప్రాణం అంటూ ఉప్పల్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం





**ఉప్పల్, మే 2 (జనం సాక్షి):** “దేశమే దేహం.. ధర్మమే ప్రాణం” అనే నినాదంతో, “హిందువులంతా కదులుదాం -- హిందూ శక్తి చాటుదాం” లక్ష్యంగా హిందూ సమ్మేళన నిర్వహణ సమితి–ఉప్పల్ ఆధ్వర్యంలో ఉప్పల్ సూర్య నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ కాలనీలకు చెందిన హిందూ బంధువులు భారీ సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రముఖ సాధువులు, ఆధ్యాత్మిక వక్తలు హిందూ సమాజంలో ఐక్యత, చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి హిందువు బాధ్యత అని పేర్కొంటూ, గోరక్షణ, వేదాలు, ఉపనిషత్తులు, హిందూ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ముఖ్యంగా నేటి యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.హిందూ సమాజం ఐక్యంగా ఉంటేనే ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భక్తి గీతాలు, ధార్మిక సందేశాలు ఆకట్టుకున్నాయి.ఈ హిందూ సమ్మేళనంలో లక్ష్మారెడ్డి కాలనీ, సూర్య నగర్ కాలనీ, సరస్వతి నగర్, హనుమ సాయి నగర్, రాఘవేంద్ర నగర్, వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాలకు చెందిన హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.